ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 17 సెప్టెంబరు 2025 | 5

పంటకాల్వలోకి దూసుకుపోయిన టాటాఏస్

స్వల్పగాయాలతో బయటపడిన ఐదుగురు జట్టు కార్మికులు.. మొండెపులంక వద్ద ఘటన

7



మంత్రి సుభాష్‌ను కలిసిన ఎస్పీ రాహుల్‌మీనా

రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంత్రి సుభాష్‌ను జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి సుభాష్‌ను కలసి పుష్ప గుచ్ఛం అందజేశారు. మంత్రిఎస్పీ మీనాను దుశ్శాలువాతో సత్కరించారు.



ఓజోన్ పొరను కాపాడుకుందాం..

పాశర్లపూడిలో ఓ3 ఆకారంలో ఒదిగిన విద్యార్థులు


మామిడికుదురు,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొరను కాపాడుకుందామంటూ పాశర్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓ3 ఆకారంలో ఒదిగి ఆకట్టుకున్నారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్కూలు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఓజోన్ పొరపై అవగాహన కల్పించారు. గొడుగులతో ఓ3 చిహ్నంగానూ కూర్చుని ఆకట్టుకున్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సూరిమేను శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అలాగే మామిడికుదురు హైస్కూలు ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటి ఓజోన్ ఉపయోగాలను తెలిపారు. ప్రధానోపాధ్యాయులు బి.చిరంజీవిరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ఆర్వీఎస్ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల బాధలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్సీ సోము

కోర్టు ఆదేశాల ధిక్కరణ.. పంచాయతీ కార్యదర్శికి వారం రోజులు జైలు

7

అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యం



అమరావతిలో కలెక్టర్ల కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



- శాంతి భద్రతలూ అంతే ప్రధానం
- 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పనిచేయాలి
- క్రైమ్ రేటు 30 శాతానికి తగ్గించాలి
- రెండో రోజు కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో సీఎం చంద్రబాబు
- కాన్ఫరెన్సుకు హాజరైన కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వేగవంతం చేయడంతో పాటు జిల్లాలో శాంతిభద్రతలు చాలా ముఖ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో జరిగిన రెండో రోజు కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో సమీక్షించి చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా జిల్లాలో ఎవరైనా కలెక్టర్ ఒక ప్రాజెక్టు చేపట్టి ప్రశంసలు అందుకుంటే దాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా శాంతిభద్రతల సమస్యల విషయంలో ఎస్పీలు రాజీలేకుండా సమర్థవంతంగా సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని యువ ఐపీఎస్‌లకు ఈసందర్భంగా జరిగిన సదస్సులో



కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా

సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. మహిళల పట్ల అత్యాచారాలు, పిల్లల కిడ్నాప్‌లు, గంజాయి మత్తులో యువత చేస్తున్న అరాచకాల వంటి అంశాలపై జిల్లాలో పోలీసులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కోనసీమ జిల్లా నుంచి ఇటీవల నియమితులైన రాహుల్ మీనాను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా అంతా పనిచేయాలి. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం దారుణంగా నష్టపోయింది. వృద్ధి రేటుపై పనిచేయడంతోపాటు స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు వనరులు ఉపయోగించాలని సీఎం సూచించారు. మానవ వనరులను సమృద్ధిగా ఉపయోగించాలని, వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్, వర్క్ ఫ్రం హోం విధానాలను అవలంబిస్తున్నాం. నేను, పవన్‌కల్యాణ్ శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాం. 30శాతం క్రైమ్ రేటును తగ్గించే విషయంలో కలెక్టర్లు, ఎస్పీలు పనిచేయాలని, సాంకేతికతను ఉపయోగించాలని చంద్రబాబు ఈ సందర్భంగా సూచించారు. శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాలోని ప్రధాన సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. వాటిపై స్పందించిన ముఖ్యమంత్రి ఆ పనులు చేపట్టేందుకు సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశాలిచ్చారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పెరగాలంటే క్వాయర్ మేట్లు వాడాలి

వర్షాలు, వరదల సమయాల్లో కోనసీమ జిల్లాలో వేసే సీసీ, బీటీ రోడ్లు తడిసి ముద్దకావడం వల్ల త్వరగా ఛిద్రమవుతున్నాయి. తరచూ మెయింటెనెన్స్‌లకు గురవుతున్నాయి. రానున్నరోజుల్లో వేసే సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణంగా రెండో లేయర్‌గా క్వాయర్ మేట్లతో రోడ్ల నిర్మాణం చేపడితే మన్నిక ఎక్కువగా ఉంటుందని కలెక్టర్ మహేష్‌కుమార్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీనివల్ల రోడ్డు నిర్మాణ నాణ్యత మరో ఐదేళ్లు పెరుగుతుందని, ఇందుకోసం రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షలు కిలోమీటరుకు అదనపు వ్యయం అవుతుందని, ఈ విషయాన్ని పరిశీలించాల్సిందిగా కలెక్టర్ చేసిన సూచనపై సీఎం స్పందించారు. తక్షణమే అధికారులను గోదావరి జిల్లాల్లో రోడ్ల విషయంలో క్వాయర్ మేట్స్‌తో ఒక లేయర్‌వేసి రోడ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జొన్నాడ ఫ్లై ఓవర్ రెండేళ్లలో పూర్తి కావాలి : సీఎం చంద్రబాబు

జిల్లాలో కోల్‌కత్తా-చెన్నై రహదారి మధ్యలో కోనసీమ జిల్లాలోని జొన్నాడలో నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ పనులు గత కొన్నేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయి ప్రజలు పడుతున్న ఇబ్బందులను జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఇది జాతీయ రహదారిలో కీలకమైన ప్రాంతం కావడం వల్ల కాంట్రాక్టరుకు ఎన్నిసార్లు పిలిచి చెప్పినా వారు స్పందించడం లేదని తక్షణమే ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చంద్రబాబును కోరారు. దీనిపై సీఎం స్పందించారు. తక్షణమే జొన్నాడ ఫ్లైఓవర్ పనులకు సంబంధించి కాంట్రాక్టరుకు నోటీసులు ఇచ్చి రద్దుచేసి మళ్లీ తిరిగి టెండర్లు పిలిచి రెండేళ్ల కాల వ్యవధిలో జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఎన్‌హెచ్ అధికారులకు సీఎం సూచించారు. దీనిపై గతంలో ఉపరితల రవాణామంత్రి, స్థానిక ఎంపీలు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో మాట్లాడినప్పటికీ ప్రయోజనం లేదని దాని దృష్ట్యా నోటీసు ఇచ్చి కాంట్రాక్టరుపై తదుపరి చర్యలు చేపడతామని ఎన్‌హెచ్ ఉన్నతాధికారులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు.





కనకాయలంక కాజ్‌వేపై చేరిన వరదనీటిలో స్థానికుల పాట్లు.. గంటిపెదపూడి వద్ద బూరుగులంక నదీపాయపై పడవ దాటుతున్న దృశ్యం

తగ్గుతూ.. పెరుగుతూ..

- గోదావరిలో నీటమునిగిన కనకాయలంక కాజ్‌వే
- వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న స్థానిక ప్రజానీకం

పి.గన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవడంతో గోదావరిలో వరద నీటిమట్టం పెరుగుతూ తగ్గుతూ ప్రవహిస్తోంది. గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన వరద మళ్లీ వారం రోజులు గడవకుండానే వరద నీరు పోటెత్తింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువన సముద్రంలోకి 5,47,004 క్యూసెక్కుల వరదనీరు ప్రస్తుతం వదులుతున్నారు. దీంతో జిల్లాలో ప్రవహించే వైనతేయ, వశిష్ఠ, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయలు ఇంకా నిండుగానే ప్రవహిస్తున్నాయి. ధవళేశ్వరం వద్ద స్వల్పంగా వరద తగ్గుముఖం పట్టినప్పటికీ చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే వరద తాకిడికి మళ్లీ నీట మునిగింది. దీంతో స్థానిక లంకగ్రామాల ప్రజానీకం వరదనీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి మరింత పెరిగితే దొడ్డిపట్ల రేవును సైతం తాత్కాలికంగా మూసివేస్తారని స్థానికులు తెలిపారు. మంగళవారం సాయంత్రం కాజ్‌వే నీటమునగడంతో పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే గంటిపెదపూడి వద్ద బూరుగులంక నదీపాయపై పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక, ఉడిమూడిలంక గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన అనగార్లంక, పెదమల్లంక గ్రామస్తులు సైతం నాటుపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. కాగా అయితే ఇప్పుడిప్పుడే వరద ముప్పు నుంచి బయటపడుతున్న ఉద్యాన పంట పొలాల్లోకి మళ్లీ వరద నీరు వచ్చి చేరుతోంది. లంకల్లో ఉన్న పల్లపు ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో పశుగ్రాసానికి సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముమ్మిడివరం నగర పంచాయతీ మాస్టర్ ప్లాన్ మ్యాప్‌ను వివరిస్తున్న కమిషనర్ పి.రవివర్మ

ముమ్మిడివరం నగర పంచాయతీ

మాస్టర్ ప్లాన్ విడుదల

ముమ్మిడివరం, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీకి కొత్త మాస్టర్ ప్లాన్ విడుదలైంది. ఈమేరకు మాస్టర్ ప్లాన్ జీవో 152ను, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధిశాఖ అప్రూవల్ పొందిన సంతకాలతో కూడిన మాస్టర్ ప్లాన్ కాపీ ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయానికి అందాయి. వీటిని కమిషనర్ పి.రవివర్మ ప్రజలకు సమాచారం నిమిత్తం మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో వివరించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి 2024లో ప్రతిపాదనలు పంపించగా మున్సిపల్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ పరిశీలించి వాటి ఆమోదానికి పురపాలక శాఖకు సిఫార్సు చేయగా వాటిని అనుమతిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మాస్టర్ ప్లాన్ 2041 వరకు అమలు కానుంది. నగర పంచాయతీ 32.4 చదరపు కిలోమీటర్లతో పాటు చుట్టుపక్కల ఉన్న పంచాయతీలను కలుపుకుని 54.42 చదరపు కిలోమీటర్ల మేర అమలు కానుంది. ఈ మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల అభివృద్ధి, భూమి వినియోగం అభివృద్ధి, లేఅవుట్లు, బిల్డింగ్ అప్రూవల్ ఈ మాస్టర్‌ప్లాన్‌కు లోబడి అనుమతులు ఇవ్వడం జరుగుతుంది. నగర పంచాయతీలో ప్రజలు ప్లాన్‌లు అన్నీ మాస్టర్ ప్లాన్ ప్రకారం అప్రూవల్‌కు అప్లై చేసుకోవాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో టీపీవో రాజేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ సునీత, ప్లానింగ్ కార్యదర్శి ఉన్నారు.



అందరి చూపూ '22'పైనే

- కొత్త వాహనాల కోసం కొనుగోలుదారుల ఎదురుచూపులు
- జీఎస్టీ కొత్త శ్లాబులు అమల్లోకి వచ్చాకే కొనేందుకు ఆసక్తి

మండపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను జీఎస్టీ తగ్గింపుతో వాహనాల ధరలు దిగివస్తున్నాయి. దాంతో వాహనాలు కొనుగోలు చేసేవారంతా ఈనెల 22న అమల్లోకి వచ్చే జీఎస్టీ రెండంచెల విధానంలో ధరల తగ్గింపుపైనే దృష్టిసారించారు. ముఖ్యంగా వాహనాలు ధరలు తగ్గింపు కార్లు కొనుగోలుదారులకు మంచి జోష్‌నిస్తున్నాయి. కారు ధర కనిష్ఠంగా రూ.65 వేలు నుంచి మొదలుకుని లక్షల్లో తగ్గే అవకాశం ఉందని విక్రయదారులు చెబుతున్నారు. జిల్లాలో దాదాపు అన్ని బ్రాండ్‌ల కార్ల షోరూమ్‌లు ఉన్నాయి. జిల్లాలో అమలాపురం మండపేట, రావులపాలెం, రాజోలు తదితర చోట్ల కార్ల షోరూంలు ఉన్నాయి. ఎంట్రీ లెవల్ హ్యాచ్‌బ్యాక్ నుంచి లగ్జరీ ఎస్‌యూవీ కార్ల వరకు కార్ల ధరలు తగ్గనున్నట్టు తెలియడంతో వాహన కొనుగోలుదారులు ఆరా తీస్తున్నారు. గత వారం రోజుల నుంచి కార్ల షోరూంలో ధరల గురించి కొనుగోలుదారులు సంప్రదిస్తున్నట్టు షోరూమ్‌ల నిర్వాహకులు చెబుతున్నారు. జీఎస్టీ తగ్గింపుతో జిల్లాలో పలువురు వచ్చే దసరా, దీపావళి పండుగ సందర్భాల్లో కొత్త కార్లు కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. ఏటా జిల్లాలో 200 నుంచి 250 వరకు కార్ల కొనుగోలు జరుగుతుంది. కోనసీమలో పూర్తిస్థాయిలో కార్ల షోరూమ్‌లు లేకపోవడం వల్ల ఉమ్మడి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరంలలో కార్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఒకవిధంగా దానివల్ల కూడా జిల్లాకు సంబంధించి రవాణాశాఖకు ఆదాయం నష్టపోతోంది. ఇక పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు కార్లను ఈనెల 22కు ముందే బుక్ చేసుకుంటే వారికి కొన్ని రకాల చిన్నకార్లపై రూ.80 వేలు తగ్గించడంతోపాటు డోర్ డెలివరీ చేస్తామని షోరూమ్‌ల వారు ఆఫర్ ప్రకటిస్తున్నారు. ఎలక్ట్రిక్ కార్ల (ఈవీ)కు సంబంధించి కూడా వినియోగాన్ని పెంచేందుకు ఇప్పటికే ఆ కార్లపై రాయితీలు అమలుచేస్తున్నారు. జీఎస్టీ ఈ వాహనాలపై వర్తించకపోయినా ప్రభుత్వ నిర్ణయంతో స్వల్పంగా ధరలు తగ్గే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు ఈవీ కార్లపై మొగ్గు చూపుతున్నారు. మరోవైపు చిన్నకార్లపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గించడమే కాకుండా ఒక శాతం సెస్ కూడా రద్దు చేశారు. 1200 సీసీ పెట్రోల్ ఇంజిన్, 1500 సీసీ డీజిల్ ఇంజన్ల కార్లకు 18 శాతం జీఎస్టీ వర్తిస్తుంది. 1500 సీసీ ఇంజిన్ నుంచి ఎక్కువ సామర్థ్యం ఉన్న పెద్దకార్లపై 28శాతం, జీఎస్టీ, 22 శాతం సెస్ విధించేవారు. ఇపుడు అది 40 శాతం ఇప్పుడు తగ్గనుంది. ఇక వివిధ కార్ల కంపెనీలు రూ.64 వేల నుంచి రూ.3.48 లక్షలకుపైబడి మోడల్‌నిబట్టి జీఎస్టీ తగ్గింపును వర్తింపజేస్తున్నాయి. దీంతో కార్ల కొనుగోలు చాలామంది ఈనెల 22వ తేదీ తర్వాత కొనుగోలు చేసేందుకు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. ఇదేవిధంగా మోటార్ బైక్‌లపై కూడా కొత్త జీఎస్టీ విధానం వర్తించనుండడంతో ఆయా వాహనాలపై 20 వేల నుంచి 30 వేల వరకు తగ్గే అవకాశం ఉంది. బైక్‌ల కొనుగోలు కూడా కొత్త జీఎస్టీతోనే కొనుగోలు చేయాలని చాలామంది ఎదురుచూస్తున్నారు.

మొదటి పంటకు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

3.88 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా

జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ పి.శ్రీనివాస్



పి.గన్నవరం, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా రాబోయే మొదటి పంటకు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ పి.శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారని చెప్పారు. పి.గన్నవరంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో మొదటి పంటకు 2,27,415 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. ఈసారి మొదటి పంటకు సంబంధించి 1,56,505 ఎకరాల్లో వరి రైతులు పంట పండించారని, 4.31 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి వివరాలు వెల్లడించారని చెప్పారు. స్థానిక అవసరాల అనంతరం 3,88,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనాలు రూపొందించారని ఆయన తెలిపారు. అయితే ఉన్నతాధికారులు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతులు ఇచ్చారని తెలిపారు. రైతులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేసేవిధంగా ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. అలాగే ఇప్పటివరకు 70 శాతం ఈ-క్రాప్ బుకింగ్ జరిగిందని, మిగిలిన 30 శాతం కూడా పూర్తవుతుందని స్పష్టంచేశారు. ఎంఎస్‌వోలు ఇస్మాయిల్, పూర్ణిమ, భారతి ఉన్నారు.



డీటీవో కార్యాలయంలో ఆటో యూనియన్ నాయకులకు జీవో నంబరు 33 ప్రతులను అందజేస్తున్న డీటీవో శ్రీనివాస్

నేటి నుంచి ఆటో కార్మికులు దరఖాస్తులు చేసుకోండి

అమలాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సొంతంగా ఆటోలు, మోటారు క్యాబ్‌లు, మ్యాక్సీ క్యాబ్‌లు కలిగి ఉన్న వాహన యజమానులకు 2025-26 సంవత్సరానికి ఒక్కొక్కరికీ రూ.15 వేల వంతున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి దేవిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలతో విడుదల చేసిన 33 నంబరు జీవోను కోనసీమ జిల్లాలోని ఆటో యూనియన్ అధ్యక్షులు, సభ్యులకు మంగళవారం రవాణాశాఖ కార్యాలయంలో ఆర్టీవో శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 17వ తేదీ నుంచి ఆటో, మోటారు క్యాబ్, మ్యాక్సీ క్యాబ్‌లకు సంబంధించిన వాహన యజమానులు సమీపంలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుతోపాటు ప్రభుత్వం కోరిన పత్రాలను బ్యాంకు వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతీ ఆటో కార్మికుడు ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని పొందాలని విజ్ఞప్తిచేశారు. సందేహాలుంటే 9281607021 ను సంప్రదించాలని డీటీవో కోరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ రవికుమార్, ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజుతోపాటు పలువురు పాల్గొన్నారు.



అమలాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్ల నిరసన

19, 20 తేదీల్లో దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

అమలాపురం టౌన్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ 2.0లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలపై ఈనెల 19, 20 తేదీల్లో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు దస్తావేజు లేఖర్ల కన్వీనర్ మట్టపర్తి రాము తెలిపారు. అమలాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖర్ల సమావేశం మంగళవారం జరిగింది. సాఫ్ట్‌వేర్ 2.0, ఓటీపీ తదితర సమస్యలపై చర్చించారు. రిజిస్ట్రేషన్లలో జరుగుతున్న జాప్యాలపై, ఎదురవుతున్న వివిధ సమస్యలపై ఆందోళనకు దిగుతున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్లు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా గుంటు ఫణిప్రసాద్ అధ్యక్షునిగా, జిన్నూరి సురేష్ ఉపాధ్యక్షునిగా, వెనుతురుపల్లి సుబ్బు, కార్యదర్శిగా పందిరి శ్రీహరి, కోశాధికారిగా గుమ్మళ్ల నరేష్, సంయుక్త కార్యదర్శిగా దుర్గేష్‌లతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జరుగుతున్న రిజిస్ట్రేషన్ల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కడలి సత్యనారాయణ, సీహెచ్ వెంకట్రామయ్య, వీరవల్లిపాలెం భూషణం, బొర్రా వెంకటేశ్వరరావు, యల్లమిల్లి బుజ్జి, పృథ్వీ, సిరిపల్లి మూర్తి, కె.మహేష్, గుప్పి సుబ్బయ్య పాల్గొన్నారు.



స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు దాటుతున్నా ఆ గ్రామస్తులకు నేటికీ రోడ్డు సౌకర్యం లేదు. వారు బాహ్య ప్రపంచానికి రావాలంటే కొండలు ఎక్కి దట్టమైన అడవిలో కాలిబాటన పయనించాల్సిందే. అంతేకాదు పలు ప్రమాదకరమైన ఏరులు, వాగులు కూడా దాటాలి. దట్టమైన అడవిలో క్రూర మృగాల బారిన పడినా, వాగులు దాటేటప్పుడు ప్రమాదవశాత్తు మునిగిపోయినా చేసేదేమీ లేదు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు తలెత్తినా, రేషన్ తీసుకోవాలన్నా వారికి ఇలాంటి ప్రయాణాలు తప్పట్లేదు.

ఆ గ్రామమే అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసిపాక సమీపంలోని దట్టమైన అడవిలో ఉన్న ఏరువాడ కొండారెడ్డి.

సెల ఏరువాడ


దట్టమైన అడవిలో కాలి బాటన ప్రయాణం


వాగు దాటుతూ...

(మోతుగూడెం-ఆంధ్రజ్యోతి)

ఏరువాడ గ్రామంలో సుమారు 30 కుటుంబాల కొండారెడ్డి ప్రజలు జీవిస్తున్నారు. అడవిలో దొరికేవే వారికి జీవనాధారం. తాగునీటికి నేటికీ వాగులే ఆధారం. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా ఈ గ్రామానికి రహదారి, విద్యుత్ సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయం. ఇందుకు కారణం ఈ గ్రామం దట్టమైన అడవిలో ఉండడమే. దీంతో అక్కడి ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. జ్వరం వచ్చినా, ఇతర ఆరోగ్య సమస్యలు ఏమైనా తలెత్తినా, ఆ అడవిలో ఏదైనా ప్రమాదం జరిగినా వారు మండల కేంద్రంలోని ఆసుపత్రికి రావాలంటే పెద్ద సాహసమే చేయాల్సి వస్తుంది. దట్టమైన ఏడు గుట్టలను దాటి కాలిబాటన రావాలంటే చాలా కష్టం. ఈ క్రమంలో చాలా మంది ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. రేషన్ సరుకుల కోసం సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న తులసిపాక రావాల్సిందే. రేషన్‌ను కాలి బాటనే కష్టపడి వాగులు, వంకలు దాటి తీసుకెళ్లాల్సిందే.


చిన్న పిల్లతో వాగు దాటుతున్న దృశ్యం



- ఏరువాడ వెళ్లాలంటే ఏరు దాటాల్సిందే!
- దట్టమైన అడవిలో ఓ కొండరెడ్డి గ్రామం
- నేటికీ రహదారి సౌకర్యం లేక అనేక అవస్థలు
- పట్టించుకోని పాలకులు, ప్రభుత్వాలు

ఏరువాడ గ్రామస్తులు ఎన్ని అవస్థలు పడుతున్నా రాజకీయ నాయకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ గ్రామానికి కనీసం అధికారులు కూడా వెళ్లలేని దుస్థితి. వీరి సమస్యలను ఎవ్వరూ పట్టించుకోరు. గ్రామస్తులను బాహ్య ప్రపంచంలోకి తీసు కువచ్చి పునరావాసం కల్పించాలని గతంలో కొంతమంది అధికారులు ప్రయత్నించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఏరువాడ గ్రామస్తులు ఆ అడవిలోనే తమ జీవనం కొనసాగిస్తున్నారు. చింతూరు ఐటీడీఏ అధికారులు, జిల్లా అధికారులు స్పందించి ఏరువాడకు రహదారి సౌకర్యం కల్పించాలని, లేదా ఆ గ్రామస్తులను వేరే ప్రాంతానికి తరలించి అక్కడ పునరావాసం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పిల్లల కోసం జీపీఎస్ పాఠశాల ఏర్పాటు

ఏరువాడలో గతంలో ఐటీడీఏ అధికారులు ఒక జీపీఎస్ పాఠశాలను ఏర్పాటుచేసి పిల్లలకు చదువులు నేర్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ స్కూల్లో 11 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు కనీస సౌకర్యాలు ఉండవు. అయినా వారు ఆ గ్రామంలోనే ఉంటూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడం విశేషం.



రాత్రయితే చిమ్మ చీకట్లో...

ఈ గ్రామానికి అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించలేకపోయారు. సోలార్ లైట్లు ఏర్పాటుచేసినా అవి తాత్కాలికంగానే పనిచేస్తాయి. దీంతో రాత్రివేళ కాగానే ఈ గ్రామం అడవిలో చిమ్మ చీకట్లోనే ఉండిపోతుంది.



మహిళల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టి

'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' అమలు

నేటి నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు



ఆరోగ్య 'షీ'రి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మహిళల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కేంద్రంలోని ఎన్డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో బుధవారం నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు 15 రోజుల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక కారణాలతో ఆసుపత్రికి వెళ్లలేని స్థితిలో ఉండే వారికి అండగా నిలిచి వారికి వైద్య సాయం అందించడమే 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' (ఆరోగ్యవంతమైన మహిళ-శక్తిమంతమైన కుటుంబం) లక్ష్యం. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఏయే సేవలందిస్తారంటే..

మహిళలు, కిశోర బాలికలకు స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తిస్తారు. గర్భిణులను పరీక్షించి వారికి అవసరమైన పోషకాహార ఆవశ్యకతను వివరిస్తారు. ఎంసీపీ కార్డులు అందిస్తారు. చిన్నారుల్లో సికిల్‌సెల్ అనీమియాను గుర్తించి చికిత్స చేస్తారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు, పోషణ్ అభియాన్, ఈట్ రైట్, తల్లీబిడ్డ సేవలు, రక్తదాన శిబిరాల నిర్వహణ, ఆయుష్మాన్ వయో వందన ఆరోగ్య కార్డుల పంపిణీ, పరిశుభ్రత, పోషకాహారానికి సంబంధించి సమాచారం, కౌన్సిలింగ్ ఇస్తారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజనలో ప్రత్యేక నమోదు చేస్తారు. సికిల్ సెల్ కార్డు, ఆభ ఐడీ రిజిస్ట్రేషన్ చేస్తారు.

226 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


బసవతారకం హాస్పిటల్ వైద్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో నిర్వహిస్తున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులకు మంగళవారం 226 మంది హాజరయ్యారని హాస్పిటల్ వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వైద్య బృందంతో చర్చలు జరిపారు. క్యాన్సర్ పట్ల అవగాహన పెరిగి ప్రజలు టెస్టులు చేయించుకోవడానికి ముందుకు వస్తున్నారని వైద్యులు ఆయనకు తెలిపారు. వచ్చే నెలలో గ్రామంలో వేరొక చోట మూడు రోజుల పాటు క్యాంపు నిర్వహించాలని ఎమ్మెల్యే వారిని కోరగా అందుకు అంగీకరించారు. అలాగే ఈ రెండు రోజుల్లో 395 మందికి పరీక్షలు చేశామని క్యాన్సర్ వ్యాధి ఉంటే వారికి చికిత్సలు అందిస్తామన్నారు. బసవతారం వైద్యులు శ్రావణకుమారి, ప్రవల్లిక, రేణుక, ప్రభాకర్, కృష్ణప్రసాద్‌లతో పాటు బిక్కవోలు, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు దుర్గాదేవి, విజయలక్ష్మి పరీక్షలు నిర్వహించారు. సొసైటీ ఛైర్మన్ నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ బుంగా రామారావు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌కు 200 మంది క్రీడాకారులు


పోటీల్లో జిమ్నాస్టిక్స్ చేస్తున్న బాలిక

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 69వ స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ అండర్-14, 17లో 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు.వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్‌లో ప్రతిభ కనబర్చారు.కార్యక్రమానికి స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, ఒలింపిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవిరాజు పాల్గొన్నారు.

నేడు టీటీకి ఎంపికలు

కాగా బుధవారం ఉదయం 9 గంటలకు అండర్-14, 17 బాలురు, బాలికలకు టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక జరుగుతాయని స్కూల్ గేమ్స్ సెక్రటరీలు తెలిపారు. వర్షం కారణంగా రబ్బీ, నెట్ బాల్ గేమ్స్ వాయిదా వేశామని, అవి ఎప్పుడు ఎక్కడ జరుగుతాయో త్వరలో ప్రకటిస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు ఎలిజిబిలిటీ ఫార్మ్, మిడ్డే మీల్స్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు కె.శ్రీనివాసరావు 90593 17248/96035 04337 నెంబర్లలో సంప్రదించాలని ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రవి రాజు తెలిపారు.

నేడు నన్నయ వర్శిటీలో రిక్రూట్మెంట్ డ్రైవ్

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


సీఆర్‌టీ శిక్షణ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 17న డాక్టర్ రెడ్డీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో బీఎస్సీ/ఎంఎస్సీలలో కెమిస్ట్రీ లేదా బయోటెక్నాలజీ పూర్తి చేసి, 10వ తరగతి నుంచి పీజీ వరకూ 60శాతం మార్కులు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. బీఎస్సీ పూర్తి చేసిన వారికి వార్షిక వేతనం రూ.2.10 లక్షలు, ఎంఎస్సీ పూర్తి చేసిన వారికి రూ.2.60 లక్షలు వేతనం ఇస్తారన్నారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తారన్నారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డిని సంప్రదించాలని వీసీ ప్రసన్నశ్రీ తెలిపారు. కాగా ఈ నెల 17 నుంచి 19 వరకూ ఇంజనీరింగ్ కళాశాలలోని ఈసీఈ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్మెంట్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

నేడు ఎయిర్‌పోర్ట్‌లో యాత్రి సేవా దివస్

విమానాశ్రయ డైరెక్టర్ శ్రీకాంత్



కోరుకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి విమానాశ్రయంలో ఈ నెల 17న యాత్రి సేవా దివస్-2025ను నిర్వహించనున్నట్టు విమానాశ్రయ డైరెక్టర్ ఎన్‌కే శ్రీకాంత్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఆధ్వర్యంలో అన్ని విమానాశ్రయాలు ఈ దినోత్సవాన్ని నిర్వహించనున్నాయి. మంగళవారం ఉదయం రాజమండ్రి ఎయిర్‌పోర్టు పరిపాలన భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విమానయానం చేసే ప్రయాణికులకు ప్రపంచ స్థాయి అనుభవాన్ని అందించేందుకు ఏఏఐ తీసుకుంటున్న చర్యలను ప్రతిబింబించేలా ఈ దినోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు.ఈ సందర్భంగా విమానాశ్రయంలో సాంస్కృతిక ప్రదర్శనలు, క్విజ్, పెయింటింగ్ పోటీలు, విమానాశ్రయ భవనాల అలంకరణలు, ప్రయాణికులకు ఉచిత వైద్య పరీక్షలు, అతిథి సత్కారం, అమ్మ పేరుతో ఒక మొక్క (ఏక్ పెడ్ మా కే నామ్) నినాదంతో చెట్లు నాటడం, సీనియర్ సిటిజన్లకు సత్కారం, విద్యార్థులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బందితో ముఖాముఖి నిర్వహించనున్నట్టు డైరెక్టర్ తెలిపారు.ప్రయాణికుల సౌకర్యం, భద్రత, సంతృప్తి ప్రాముఖ్యతను పునరుద్ఘాటించడం యాత్రి సేవా దివస్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

రూ.4వేల కోట్ల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలి

ముంపు గ్రామాల్లో సభలు పెట్టాలి.. ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు



సమావేశంలో మాట్లాడుతున్న అయినాపురపు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎస్సీ, ఎస్టీ నిర్వాసితులకు రూ.4 వేల కోట్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని చెల్లించాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీఎస్టీ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా గృహనిర్మాణాలకు భూసేకరణ చేసిన జిల్లా కలెక్టర్లపై కేసులు నమోదుచేయాలని డిమాండ్ చేశారు.ప్యాకేజీ చెల్లించే వరకు నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదన్నారు. జీలుగుమిల్లి పరిధిలో నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, దీనిపై గ్రామ సభలో చేసిన తీర్మానాన్ని గౌరవించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలలో అక్టోబర్ 3న గ్రామ సభలు నిర్వహించాలని కోరారు.సమావేశంలో మిడియం వెంకటస్వామి, పూనెం విష్ణు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణాల కోసం డీపీఆర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి, అన్నవరం, రాజమహేంద్రవరం దివాన్‌చెరువు సెక్షన్ పరిధిలో నాలుగు లైన్ల జాతీయ రహదారి(ఎన్‌హెచ్-16) నిర్మాణాల కోసం డీపీఆర్ రూపకల్పన చేస్తున్నారు. దీన్ని ఆమోదించడానికి కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించనున్నట్టు కాకినాడ డీఆర్వో వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన వెలువరించారు. సమావేశానికి జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి

ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాస్త్రి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా ప్రభుత్వం పెండింగ్ డీఏలను మంజూరు చేయడంతోపాటు 30% ఐఆర్‌ని ప్రకటించి పీఆర్సీ కమిషన్‌ని నియమించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి వీవీ శాస్త్రి పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాజమహేంద్రవరంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సంఘ సభ్యత్వ నమోదును చేపట్టారు. అనంతరం జిల్లా ఆపస్ నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా మండల విద్యాశాఖాధికారుల(ఎంఈవో) బదిలీలు నిర్వహించకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఎంఈవో కార్యాలయాల్లో పని చేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు కూడా 22 ఏళ్లుగా ఒకే చోట ఉండిపోయారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్పీల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. వీరందరికీ మినిమం టైమ్ స్కేల్ మంజూరు చేయడంతో పాటు బదిలీలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లోని హెచ్‌ఎంల పోస్టులను ప్రమోషన్లతో భర్తీ చేయాలన్నారు.

5.47లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..

ధవళేశ్వరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి పెరుగుతూ తగ్గుతూ ప్రవహిస్తోంది. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం తగ్గుతుండగా ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న మిగులు నీటి ప్రవాహంతో ఎగువన గోదావరి పెరుగుతోంది. మంగళవారం ఉదయం కాటన్ బ్యారేజ్ నుంచి 5.84లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేసిన అధికారులు ఎగువ నుంచి వస్తున్న ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో సాయంత్రానికి 5,47,004క్యూసెక్కులు మిగులు ప్రవాహాన్ని సముద్రంలోకి విడుదల చేస్తుందన్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.20 అడుగులుగా నమోదైంది. అల్పపీడనప్రభావంతో కురుస్తున్న వర్షాలకు డెల్టా కాలవలకు నీటి విడుదల తగ్గించారు. తూర్పుడెల్టాకు 4200క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1600క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4500 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టిన నీటి మట్టం 37.70 అడుగులుగా నమోదైంది.

పిఠాపురం ఆలయాల్లో మహారాష్ట్ర ఎంపీ పూజలు


అప్పా బర్నేకు స్వాముల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో సౌజన్య

పిఠాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పలు ఆలయాలను మహారాష్ట్ర ఎంపీ, శివసేన పార్లమెంటరీ చీఫ్ విప్ శ్రీరంగ్ అప్పా బర్నే సందర్శించారు. మంగళవారం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బర్నేను ఈవో ఆర్.సౌజన్య ఆలయ మర్యాదలతో సత్కరించి స్వాముల చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు.అనంతరం అప్పా బర్నే పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.ఆయన్ను ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటం,ప్రసాదాలు అందజేశారు. ఎంపీ వెంట జనసేన నాయకులు పలువురు ఉన్నారు.

బీచ్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు


కొత్తపట్నం వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం



కొత్తపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ సమీపంలో కొత్తపట్నం వద్ద అలల ధాటికి కోతకు గురైన రక్షణ గట్టుకు, బీచ్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కొత్తపట్నం వద్ద బీచ్‌రోడ్డుకు రక్షణగా గతంలో ఏర్పాటుచేసిన బండరాళ్లు, బీచ్‌రోడ్డు కోతకు గురవడం విధితమే. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పెద్ద సైజు బండరాళ్లను కొత్తపట్నం తరలించి తాత్కాలికంగా కోత నివారణకు చర్యలు చేపట్టారు. అలాగే కొత్తపట్నం, సుబ్బంపేట వద్ద రోడ్డుకు ఏర్పడిన గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు.

నాప్‌కిన్ డిస్పెన్సర్ల ఏర్పాటుకు కొటేషన్లు ఆహ్వానం

ఉమ్మడి తూర్పుగోదావరి పీడీజే సునీత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 15 కోర్టు సముదాయాల్లోని వాష్‌రూముల్లో శానిటరీ నాప్‌కిన్ డిస్పెన్సింగ్ యంత్రాలు, వినియోగం తర్వాత ధ్వంసం చేసే పరికరాల(ఇన్సినరేటర్) ఏర్పాటు, నిర్వహణకు 119 యూనిట్ల సరఫరా కోసం అనుభవం ఉన్న ఏజెన్సీల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. సీల్డ్ కవర్‌లో ఈ నెల 30వ తేదీలోపు తమకు కొటేషన్లను అందజేయాలన్నారు. అలాగే జిల్లా కోర్టుల ఆవరణలో ఉన్న రెండు ఎండిన వేప చెట్లను తొలగించడానికి ఈ నెల 25న సాయంత్రం 4.30గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

మోటార్‌సైకిళ్లే టార్గెట్..

- ఐదుగురు అంతర్‌జిల్లా దొంగలను పట్టుకున్న పెరవలి పోలీసులు
- రూ.40 లక్షల విలువైన 26 బైక్‌ల స్వాధీనం

పెరవలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్లను చోరీ చేసిన ఐదుగురు అంతర్‌జిల్లా దొంగలను పెరవలి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 26 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. తుమ్మగంటి ధనుష్ (తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి), విశ్వనాధుల దేవిశ్రీప్రసాద్, అబ్బిరెడ్డి పాపారావు (కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి)లు కలిసి బైక్ చోరీలకు పాల్పడేవారు. వారి ముగ్గురిని చూసి ధనుష్ తమ్ముడైన నెక్కంటి యువరాజ్ కూడా దొంగతనాలు చేసి డబ్బు సంపాదించాలనుకుని వనచర్ల శక్తిరాజు, కూనపరెడ్డి వీరబాబు(ఖండవల్లి)తో కలిసి మోటారుసైకిళ్ల దొంగతనాలకు పాల్పడ్డారు. వారు దొంగిలించిన మోటారు సైకిళ్లన్నీ వారి ఇళ్ల వద్ద పెట్టుకుని ఒక్కసారిగా అమ్ముదామనుకున్నారని డీఎస్పీ తెలిపారు. వారిలో ఐదుగురిని ఖండవల్లి వద్ద పట్టుకున్నట్టు చెప్పారు. కేసు విచారణలో పెరవలిలో 4, ఉండ్రాజవరంలో 1, రాజమండ్రిలో 6, బొమ్మూరులో 1, పెనుగొండలో 3, పెనుమంట్రలో 2, ఇరగవరంలో 1, రావులపాలెంలో 3, ప్రత్తిపాడులో 2, సామర్లకోటలో 2, తునిరూరల్‌లో 1, విశాఖ జిల్లా ఆనందపురంలో 1, ఎంవీపాలెంలో 1 కేసులు నమోదు కాగా మొత్తం 26 మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్టు తేలిందన్నారు. వాటిలో సుజుకీ మోటారు సైకిళ్లు 15, రాయల్ ఎన్‌ఫీల్డ్ 6, పల్సర్‌బైక్‌లు 4, హెచ్‌ఎఫ్ డీలక్స్ 1 ఉన్నట్టు చెప్పారు. మొత్తంలో 25 కేసుల్లో ఐదుగురు దొంగలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్ల విలువ సుమారు రూ.40లక్షలు వరకు ఉంటుందని తెలిపారు. ఖండవల్లికి చెందిన మోతరపు శివప్రసాద్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన పెరవలి ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, ట్రైనీ ఎస్ఐ కె.సౌజన్య, పోలీసుస్టేషన్ సిబ్బంది కె.శ్రీహరి, నరేంద్ర, ముత్యాలు, గంగాధరరావు, ప్రసాద్, రమేష్, హనుమంతు, శ్రీను, పవన్, సాంభయ్య, జాకీర్ రెహ్మాన్, జి.అనిల్‌ను ఎస్పీ అభినందించినట్టు, వారికి రివార్డులు ఇస్తున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు.


పెరవలిలో వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ, నిడదవోలు సీఐ, పెరవలి ఎస్ఐ, ట్రైనీ ఎస్ఐ

- సర్పవరంలో యువకుడి అరెస్ట్
- 11 బైక్‌లు స్వాధీనం


సర్పవరంలో నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి 11 వాహనాలను సర్పవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వివరాలను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు మంగళవారం విలేకర్లకు తెలిపారు. బైక్ చోరీల నివారణ, చోరీ సొత్తు స్వాధీనం కోసం కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎ స్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో సీఐ పెద్దిరాజు ఆధ్వర్యంలో నిందితుల కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామన్నారు. సామర్లకోట మండలం పండ్రవాడ గ్రామానికి చెందిన పెంకే తేజ(20) బైక్ చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించి మంగళవారం సర్పవరం ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అరెస్ట్ చేశారు. నిందితుడు ఎత్తుకుపోయిన 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని సీఐ పెద్దిరాజు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.6.50 లక్షలు ఉంటుందన్నారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్, హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, గణేష్, కానిస్టేబుల్స్ రవి, శ్రీనివాస్, అనిల్, చిన్నబాబు, కిషోర్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ధర్మవరం హైవేపై ఘటన


మృతిచెందిన నాగేశ్వరరావు


ప్రమాదానికి కారణమైన లారీ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై మంగళవారం కంటైనర్ లారీ స్కూటీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కథనం మేరకు.. కాకినాడ జిల్లా తొండంగికి చెందిన కడారి నాగేశ్వరరావు, వేముల శ్రీను ప్రత్తిపాడు మండలంలో ఓ చేపల చెరువు వద్ద పనిచేస్తున్నారు. 10 రోజులకు ఒకసారి తమ స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి మళ్లీ చెరువు వద్దకు వస్తుంటారు. ఈ క్రమంలో తొండంగి వెళ్లిన నాగేశ్వరరావు, శ్రీను స్కూటీపై మంగళవారం ప్రత్తిపాడుకు బయల్దేరారు. ధర్మవరం సత్తెమ్మతల్లి గుడి సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి తుని నుంచి రాజమండ్రి వెళ్తున్న కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో కడారి నాగేశ్వరరావు(39)అక్కడికక్కడే మృతిచెందగా, వేమల శ్రీను గాయపడ్డాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. తమకు దిక్కు ఎవరంటూ రోదించారు. గాయపడిన రేమాల శ్రీను ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ లక్ష్మీకాంతం, పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


సోమరాజు (ఫైల్)

అన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా అన్నవరంలో జరిగింది. అన్నవరంలో వెలంపేటకు చెందిన బర్ల సోమరాజు (40) గ్రామంలో ఎలక్ట్రీషియన్‌గా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఒక లేఅవుట్‌లో ఇంటికి పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వేద్దామని స్థానిక విద్యుత్‌శాఖ అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కరెంట్ స్తంభం ఎక్కాడు. అక్కడ వైర్ పట్టుకోవడంతో వెంటనే షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సమయంలో అక్కడ దగ్గర్లో ఉన్న దేవస్థానం సబ్‌స్టేషన్ ట్రిప్ అయినట్టు ఏఈ తెలిపారు. అన్నవరం ఎస్ఐ హరిబాబు, ఎలక్ట్రికల్ ఏఈలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

పంటకాల్వలోకి దూసుకుపోయిన టాటాఏస్

స్వల్పగాయాలతో బయటపడిన ఐదుగురు జట్టు కార్మికులు

కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంక వద్ద ఘటన

పి.గన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంక వద్ద కాంక్రీటు మిల్లర్‌తో కూడిన టాటా ఏస్ వాహనం మంగళవారం అదుపుతప్పి పంటకాల్వలోకి దూసుకుపోయింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కొత్తపేట మండలం పలివేల గ్రామానికి చెందిన కాంక్రీటు పనిచేసే జట్టు కార్మికులు పనినిమిత్తం రాజోలు మండలం జగ్గన్నపేట వెళ్లారు. పని ముగించుకుని తిరిగివచ్చే క్రమంలో మొండెపులంక వచ్చే సరికి అదుపు తప్పి పక్కనే పంటకాల్వలోకి దూసుకుపోయింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న ఐదుగురు జట్టు కూలీలు స్వల్పగాయాలతో బయటపడగా కాంక్రీటు మిల్లరు, టాటా ఏస్ వాహనం పూర్తిగా మునిగిపోయాయి. స్థానికుల సాయంతో వాహనాలను, కాంక్రీటు పనులకు వినియోగించే ఇనుప నిచ్చెనలను బయటకు తీశారు. అలాగే పలువురు సెల్‌ఫోన్‌లు సైతం నీటిలో మునిగిపోయినట్టు బాధితులు పేర్కొన్నారు.


మొండెపులంక వద్ద పంటకాల్వలోకి దూసుకుపోయిన టాటాఏస్, కాంక్రీటు మిల్లరు

రైస్‌మిల్లర్‌కు బెదిరింపులు..
పి.గన్నవరంలో అధికారుల విచారణ

పి.గన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థ సభ్యుడిగా వ్యవహరిస్తున్న వ్యక్తి రైస్ మిల్లర్‌ను బెదిరించి దందాకు పాల్పడిన ఘటనపై సివిల్‌సప్లయి అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్షయ రైస్ మిల్లు వద్దకు వారంక్రితం ప్రభుత్వ సంస్థ సభ్యుడిగా వ్యవహరిస్తున్న వ్యక్తి ప్రత్యేక వాహనంలో నలుగురితో కలిసి వచ్చాడు. మిల్లులోకి వెళ్లి రేషన్ బియ్యం పక్కతోవ పడుతున్నాయని, లారీతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటామని బెదిరించి రూ.8లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. మిల్లు యజమాని రూ.1.50లక్షలు ఇవ్వడంతో సదరు వ్యక్తి అనుచరులతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఈవిషయం ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. దీంతో జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ పి.శ్రీనివాస్, ఎంఎస్‌వోలు ఎండి ఇస్మాయిల్, పూర్ణిమ, భారతి మిల్లు వద్దకు వెళ్లి స్టాక్ రిజిష్టర్లు, స్టాకు పరిశీలించారు. ఘటనపై మిల్లు యజమానితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ విషయమై శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ నిర్వహించామని నివేదికను అధికారులు అందిస్తామని వివరాలు వారే వెల్లడిస్తారని తెలిపారు.

రైతుల బాధలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్సీ సోము వీర్రాజు


కేశనపల్లిలో కొబ్బరిచెట్లను పరిశీలిస్తున్న సోము

మలికిపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ పొంగి లక్షలాది కొబ్బరిచెట్లు చనిపోయి తీర ప్రాంత గ్రామాల్లోని రైతులు పడుతున్న బాధలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా ప్రయత్నిస్తానని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలోని తుఫాన్ సెంటర్ భవనంలో రైతులు, ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు సస్యశ్యామలంగా ఉండే తీర ప్రాంతంలో కేశనపల్లి, తూర్పుపాలెం, శంకరగుప్తం తదితర గ్రామాలను చూస్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో శంకరగుప్తం డ్రెయిన్ పొంగి లక్షలాది కొబ్బరిచెట్లు చనిపోయి రైతులకు అపార నష్టం కలుగుజేస్తున్నాయని, శాశ్వత పరిష్కారాలు ప్రభుత్వాలు చూపకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు సోము దృష్టికి తీసుకువచ్చారు. సోము మాట్లాడుతూ ఈప్రాంత సమస్యను స్వయంగా చూశానని, కొబ్బరిచెట్లు చనిపోవడం తీవ్రంగా కలచివేస్తుందని, స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అసెంబ్లీలో ప్రస్తావిస్తారని తెలిసిందని, తాను కూడా శాసనమండలిలో ప్రస్తావించి కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానన్నారు. కేశనపల్లిలో చనిపోయిన కొబ్బరిచెట్లను పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్,మండలాధ్యక్షుడు మేడిచర్లచాణిక్య ఉన్నారు.

కోర్టు ఆదేశాల ధిక్కరణ..
పంచాయతీ కార్యదర్శికి వారం రోజులు జైలు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన కేసులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ కార్యదర్శి దుర్గాభవానీకి వారం రోజులు జైలు శిక్ష విధించింది. ఆ శిక్షను రెండు రోజుల పాటు నిలుపుదల చేసి ఈనెల 17న కోర్టుకు హాజరుకావాలని కార్యదర్శిని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గున్నేపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన ముత్తాబత్తుల సత్యనారాయణ తాను తక్కువ కులం వాడిని కావడంతో గ్రామంలో రాజకీయం చేసి తమ ఇంటి ఎదురుగా మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు చేపడుతున్నట్టు ఈ ఏడాది జనవరిలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయవాది మాకిరెడ్డి మనోజ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రిట్‌పై టి.రాజశేఖర్ ధర్మాసనం అన్ని అంశాలను పరిశీలించి ఆ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు. అయితే హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులను ధిక్కరించి అదే ప్రాంతంలో మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఈనెల 15న కోర్టు ఉత్తర్వుల ధిక్కరణపై న్యాయవాది మనోజ్ కంటెంప్ట్ ఆఫ్ ది కోర్టు పిటిషన్‌పై దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయవాది వాదనలతో ఏకీభవించింది. పంచాయతీ కార్యదర్శి దుర్గాభవానీని వారం రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీకి తీసుకోవాలని ఆదేశించింది. జైలు శిక్షను రెండు రోజుల పాటు నిలుపుదల చేసి ఈ నెల 17న కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. ఇలా ఉండగా జలజీవన్ మిషన్ నిధులతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలువురు అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.

రమణయ్యపేట - జె.అన్నవరం రోడ్డుకు
తక్షణం మరమ్మతులు చేయాలి

డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం

ఏలేశ్వరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వరకు ఉన్న రోడ్డుకు తక్షణం మరమ్మతులు చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు దుస్థితిపై వివిధ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలపై ఆయన స్పందించి ఆదేశాలు ఇచ్చారు. వెంటనే రహదారిపై ఉన్న గుంతలను పూడ్చాలని కాకినాడ జిల్లా అధికారులను ఆదేశించారు. నేషనల్ డవలప్‌మెంట్ బ్యాంక్ ధనంతో ఈ రహదారిని త్వరలో పునఃనిర్మిస్తారన్నారు. పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రయాణికులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చేయాలని పవన్ సూచించారు. గుంతలు లేని రహదారులు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం సామాజిక మాధ్యమంలో వివరించారు.

'ఏలేరు'లో పెరుగుతున్న నీటి నిల్వలు


ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. గోదావరి జలాలు, మెస్తారు వర్షాలు రిజర్వాయర్‌లో వచ్చి చేరడంతో నీరు పెరుగుతోంది. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 1400 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 82.41 మీటర్ల స్థాయిలో 16.48 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 175 క్యూసెక్కులు వంతులకు నీరు చేరుతోంది. దీంతో సాగు నీరు విడుదలవ్వడంతో రైతులకు పంటలపై భరోసా ఏర్పడింది.

ఆటోను ఢీకొన్న లారీ

ఇంటి మీదకు వెళ్లిన వైనం

నలుగురికి గాయాలు


ఇంటి మీదకు వెళ్లిన ఆటో

ఎటపాక, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్యాసింజర్ ఆటోని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఆటో ఓ ఇంటి మీదకు వెళ్లగా నలుగురికి గాయాలైన సంఘటన మంగళవారం ఎటపాక మండలం బండిరేవు వద్ద జరిగింది. గౌరిదేవిపేట గ్రామానికి చెందిన డయాలసిస్ రోగిని చింతూరు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లి ఆటోలో ఇంటికి వస్తున్న క్రమంలో బండిరేవు వద్దకు రాగానే వెనుక వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆటో జాతీయ రహదారి పక్కన ఉన్న ఇంటి మీదకు వెళ్లిపోయింది. ఆటో డ్రైవర్ డి.రామారావుతోపాటు ఇద్దరు ప్రయాణికులు, డయాలసిస్ రోగికి గాయాలయ్యాయి.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

రంపచోడవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో మంగళవారం గంగవరం మండలంలో దాడులు నిర్వహించి 10 మద్యం బాటిళ్లతో వీర వెంకట సత్యనారాయణను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సారా కేసుల్లో నిందితులుగా ఉన్న 8 మందిని అరెస్టు చేశామన్నారు. అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

హత్య కేసులో దంపతులకు పదేళ్ల జైలు

పెద్దాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హత్యకేసులో భార్యభర్తలకు కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించినట్టు పెద్దాపురం సీఐ పి.విజయశంకర్ తెలిపారు. 2022లో కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామానికి చెందిన ఆదిన ప్రసాద్, అతడి భార్య లక్ష్మి సరిహద్దు తగాదా నేపథ్యంలో జరిగిన ఘర్షణలో పాలాని మంగను ఇంటి మెట్లపై నుంచి తోసివేయడంతో మృతిచెందింది. దీంతో మృతురాలి కుమార్తె కరెళ్ల పాపారత్నం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ పి.శివకుమార్ కేసు నమోదు చేశారు. దీనిపై వాదోపవాదాలు జరిగి నేరం రుజువు కావడంతో నిందితులకు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దీప దైవకృప 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించారు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గన్నంరాజు వినయ్ తేజ, రాగం కామేశ్వరరావు వాదనాలు వినిపించారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఆరునెలల జైలు

పిఠాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి తీర్పు చెప్పారు. ఫిర్యాది తరపు న్యాయవాది బీవీవీ సత్యనారాయణ రాజు అందించిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన గన్నేరు ఈశ్వరరావు వద్ద నాగులాపల్లికి చెందిన కేపీ రెడ్డి రూ.3.85లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీనిపై అతడు ఇచ్చిన చెక్‌బౌన్స్ కావడంతో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు దాఖలు చేయగా 2022లో 6నెలల జైలు శిక్ష, అప్పు చెల్లించని పక్షంలో మరో 3 నెలలు జైలుశిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. దీనిపై కేపీ రెడ్డి జిల్లా కోర్టులో అప్పీలు చేయగా కింద కోర్టు తీర్పునే ఖరారు చేసింది.

ఆయిల్ దొంగతనానికి యత్నం
నలుగురి అరెస్ట్

కేసు నమోదు

తొండంగి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం రావికంపాడు సమీపంలో సోమవారం రాత్రి ఐవోసీఎల్ పైపులైన్ నుంచి ఆయిల్ దొంగతనానికి ప్రయత్నించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు తెలిపారు. మంగళవారం తొండంగి పోలీస్‌స్టేషన్‌లో దీనికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. నలుగురు గునపాలు, పారలు పట్టుకుని పైప్‌లైన్ వద్ద మట్టి తవ్వుతుండగా వాహనాలు రావడంతో అక్కడి నుంచి పారిపోయారు. ఈ విషయం తెలుసుకుని ఐవోసీఎల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేయగా నలుగురు వ్యక్తులు ఈ సంఘటనలో ఉన్నట్టు గుర్తించామన్నారు. చక్కా శంకర్, రచ్చ భాగరాజు, కర్రి కేశవ్, దడాల ఆంజనేయులను అరెస్టు చేసి విచారించామన్నారు. వారిలో శంకర్, భాగరాజులపై సమీప పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయన్నారు. నలుగురిని అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. ఎస్ఐ జగన్మోహన్ ఉన్నారు.

పంటకాల్వలో యువకుడి మృతదేహం లభ్యం


తాండవపల్లిలో లభ్యమైన మృతదేహం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తాండవపల్లి గ్రామంలోని శెట్టిపల్లి పంటకాల్వలో మంగళవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్టు అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. మృతుడి వయసు 25 నుంచి 30సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతదేహం పూర్తిగా ఉబ్బిపోయి ఉందని.. తెలుపు, నీలం రంగు షర్టుతో పాటు కుడిచేతి మీద దీపిక పేరుతో పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే తాలూకా ఎస్ఐ సెల్ 9440796562, తాలూకా సీఐ 9440796525కు సమాచారం అందించాలని కోరారు.

స్వగ్రామానికి కోనసీమ మహిళ మృతదేహం


విజయ భారతి (ఫైల్)

మలికిపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో అనారోగ్యంతో మృతి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మహిళ మృతదేహం 13 రోజులకు స్వగ్రామానికి చేరింది. మలికిపురం మండలం పెదతిప్ప గ్రామానికి చెందిన రాపాక విజయభారతి(56) నాలుగేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లింది. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో స్పృహ కోల్పోయి యజమాని ఇంట్లో చనిపోయింది. దీంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి కావాల్సిన కార్యక్రమాలను అక్కడే ఉంటున్న పెదపాటి సురేష్, నల్లి చిన్నా, నల్లి శృతి ఎంబసీ సహాయంతో పూర్తిచేశారు. మృతదేహాన్ని నల్లి శృతి దగ్గరుండి తీసుకురావడంతో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తీసుకురావడానికి ఎటువంటి ఖర్చు లేకుండా ఆంధ్రప్రదేశ్ నాన్‌రెసిడెన్స్ తెలుగు సొసైటీ ద్వారా నల్లి శంకర్ సహాయంతో స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతదేహానికి రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, గెడ్డం తులసీభాస్కర్, గెడ్డం ఫిలిప్‌రాజు, నల్లి శివ నివాళులర్పించారు.

రైలు నుంచి జారి పడి విద్యార్థికి తీవ్ర గాయాలు

తుని రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారి పడి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గరికిన హేమన్ రాజు తీవ్ర గాయాలపాలయ్యాడు. కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న హేమన్‌రాజు రోజూ తుని నుంచి రైల్లో సామర్లకోట వరకు వెళ్లి అక్కడ నుంచి కళాశాలకు వెళ్తుంటాడు. మంగళవారం రద్దీ ఎక్కువగా ఉండడంతో రైలు ఎక్కే క్రమంలో కిందకు జారిపడ్డాడు. అతడి కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తుని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యుల సిఫార్సు మేరకు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించినట్టు రైల్వే జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

మనస్తాపంతో హిజ్రా ఆత్మహత్య


జాస్మిన్ (ఫైల్)

కాకినాడ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ హిజ్రా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ తూరంగిలోని మహాలక్ష్మినగర్‌కు చెందిన హిజ్రా జాస్మిన్ (19) కొద్ది రోజుల క్రితం ఓ అబ్బాయిని ప్రేమించింది. అయితే అతడికి జాస్మిన్‌తో విభేదాలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి తన ఇంటిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయంపై ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమలాపురం

ఫ్యాన్లు చోరీ

ముమ్మిడివరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం పోలీసుస్టేషన్ చెంతనే ఉన్న పలు షాపుల్లో ఫ్యాన్లను దుండుగులు దొంగిలించుకుపోయారు. పోలీస్‌స్టేషన్‌కు దగ్గరలో ఉన్న దస్తావేజు లేఖర్ చవటపల్లి వెంకటేశ్వరరావు షాపులోని ఫ్యాను, బొక్కా గణేష్‌కు చెందిన జ్యూస్ సెంటర్‌లోని ఫ్యాన్‌ను సోమవారం రాత్రి అపహరించారు.

బాలబాలాజీ సేవలో ఓఎన్జీసీ డిప్యూటీ డైరెక్టర్

మామిడికుదురు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని ఓఎన్జీసీ డిప్యూటీ డైరెక్టర్ డీఆర్ కన్నన్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదాశీర్వచనం ఇచ్చి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

● మండల పరిషత్ సమావేశం



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

అమలాపురం రూరల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరును ప్రజాప్రతినిధులు నిలదీశారు. మండలంలో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని, ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీపీకే సంఘీభావం తెలిపారు. దాంతో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చినబాబు మాట్లాడుతూ సకాలంలో కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు కాకపోవడం వల్ల ఈపరిస్థితి ఏర్పడిందని వివరించారు. అసంపూర్తిగా మిగిలిపోయిన ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లేలా ప్రజాప్రతినిధులు తీర్మానం చేశారు. ఎంపీటీసీ సభ్యుడు రేవు శ్రీనుబాబు మాట్లాడుతూ డ్వాక్రా రుణాలకు టార్గెట్లు విధించి మరీ సొమ్ములు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో డ్వాక్రా ఏపీఎం, ఎంపీటీసీల మధ్య వాగ్వివాదాంచోటుచేసుకుంది. రుణాలు సక్రమంగా ఇవ్వడం లేదంటూ ఎంపీటీసీ వాసంశెట్టి శ్రీనివాసరావు విమర్శించారు. బండారులంక ఎంపీటీసీ అంకం హిమభారతి మాట్లాడుతూ గ్రామంలో నడుస్తున్న కుట్టుమిషను శిక్షణకు సంబంధించిన పూర్తివివరాలు అందించాలని కోరారు. ఈదరపల్లి ఎంపీటీసీ అడపా సత్తిబాబు మాట్లాడుతూ ఏళ్లగడిచిపోతున్నా ఎంపీటీసీ సభ్యులకు గౌరవవేతనం చెల్లించడం లేదని ప్లకార్డుతో నిరసన తెలిపారు. ఆయనకు పలువురు ఎంపీటీసీలు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహిస్తుందని, దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎంపీపీ సూచించారు. ఐసీడీఎస్‌ప్రాజెక్టు అధికారిణి రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్నిఅందిస్తున్నామన్నారు. ఈనెల17నుంచి పోషన్ మహాకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంపీడీవో ద్వాదశమూర్తి, సర్పంచ్‌లు రేలంగి దుర్గారావు, గంగుమళ్ల ఏసుబాబు, దాసరి అరుణ, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు పరమట నాగమణి, మెండు గంగాభవానీ, ఉడుము రామకృష్ణ, ఈవోపీఆర్డీ రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, విజయకుమారి, ఏపీవో శ్రీనుబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు వారధి పోటీలు



అమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీంబాషా

అమలాపురంటౌన్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వారధి పోటీలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మి పేర్కొన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు వారధి జిల్లాస్థాయి పోటీలను మంగళవారం అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రతీ ఏటా ఈపోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల స్థాయి, మండల స్థాయిల్లో పోటీల అనంతరం జిల్లా స్థాయిలో విజేతలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్టు అమలాపురం మండల విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయి పోటీల తేదీలను ప్రకటిస్తామన్నారు. జిల్లాస్థాయివిజేతలకు బహుమతులు అందజేశారు. ఈపోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఆర్.వెంకటేశ్వరరావు, ఏవీఎల్ నరసింహారావు, బీవీఎల్ఎన్ శ్రీరామ్, కాశే దుర్గాభవానీ, ఉదయశంకర్, సీహెచ్ఎల్వీ నరసింహారావు, జి.సీతారామలక్ష్మి, ఎస్.బాబులు వ్యవహరించారు.

12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి



కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పన్నెండవ పీఆర్సీ కమిషన్‌ను తక్షణం నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్-257 ఆధ్వర్యంలో మంగళవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావుకు ఉపాధ్యాయులు అందజేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఆర్థిక బకాయిలను తక్షణం చెల్లించాలని, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లాశాఖ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్‌రహీమ్, ఎండీ సిరాజ్, ఎన్.లల్లి, కమిడి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మామిడికుదురు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. ఇటీవల నగరం సొసైటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఈలి శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ ఆయన స్వగృహం వద్ద కలిసి దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీని పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు కలిసి సమస్యలను వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



అమలాపురం నుంచి భద్రాచలం బయలుదేరిన పూర్వ విద్యార్థులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 50ఏళ్ల అనంతరం తిరిగి మంగళవారం కలుసుకున్నారు. అమలాపురం శ్రీకామాక్షీ పీఠం ప్రేమమందిరం విద్యార్థులకు వారు ఆర్థిక సాయం అందించారు. తాము చదువుకున్న పాఠశాలలో సైకిల్ షెడ్డు నిర్మించారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా అంధులు, పేదలకు ఆహారం అందించారు. 1974లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల బృందం ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ అనుభవాలను స్మరించుకుంటూ గడిపారు. భక్తి భావంతో కడప రామనామ క్షేత్రం వారితో కలిసి రాసిన రామకోటి ప్రతులను భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామికి సమర్పించేందుకు ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లారు. 40మంది పూర్వ విద్యార్థులు ఉన్న ఈబృందం బుధవారం ఉదయం భద్రాచలంలో రామనామకోటి ప్రతులను అందిస్తామనితెలిపారు. శివ, రామ్‌గోపాల్, రామారావు, చిక్కాల నాగేంద్ర, బాబూరావు, నారాయణరావు, రవీంద్రమూర్తి, శ్రీహరి, లక్ష్మి, విజయ, డాక్టర్ కె.శ్రీమన్నారాయణ, డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ జన్మదినం.. సేవా కార్యక్రమాలు చేపట్టాలి

మలికిపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల17న ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బుధవారం నుంచి అక్టోబరు 2వరకు సేవా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. చింతలమోరిలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈసందర్భంగా చింతలమోరి సొసైటీ అధ్యక్షుడు దొడ్డా నాగబాబు సమకూర్చిన దుప్పట్లను వృద్ధులకు పంపిణీ చేశారు. సమావేశంలో అడబాల సత్యనారాయణ, నల్లా పవన్‌కుమార్, పాలూరి సత్యానందం, దత్తాత్రేయ, మాలే శ్రీనివాసనగేష్, మేడిచర్ల చాణుక్య, కాపిశెట్టి కనకేశ్వరరావు, కంచి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం రవాణాకు సహకరించండి

అమలాపురం,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని రైసు మిల్లులకు రవాణా చేయడానికి అర్హులైనవారు దగ్గరలో ఉన్న రైతు సహాయక కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాస్ కోరారు. వాహనాలు, బ్యాంకు అక్కౌంట్ వివరాలను సమీపంలో ఉన్న రైతు సహాయక కేంద్రాల్లో నమోదు చేయించాలని లారీ, ట్రాక్టర్ల యజమానులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా మంగళవారం లారీ యూనియన్ యజమానులతో ఏర్పాటుచేసిన సమావేశంలో డీటీవో మాట్లాడారు. ఖరీఫ్ ధాన్యం రవాణాకు వాహన యజమానులు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. సమావేశంలో మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ రవికుమార్, లారీ ఓనర్స్ సంఘం అధ్యక్షుడు నల్లా రాంబాబు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రహోమం

ఐ.పోలవరం, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఆరుద్ర నక్షత్రం మహా పర్వదినం పురస్కరించుకుని మురమళ్ల శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామికి మంగళవారం రుద్రహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, రుద్రహోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.2కోట్లతో అగ్నికుల క్షత్రియుల కల్యాణ మండపం

అమలాపురంరూరల్,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో రూ.2కోట్లతో నిర్మించనున్న అగ్నికుల క్షత్రియుల కమ్యూనిటీ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లంకె భీమరాజు ఉన్నారు. అనంతరం ఈదరపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన బీవీ రమణయ్య-పాలమూరి బాలకృష్ణ కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. జరుగుతున్న కల్యాణ మండపం పనులను ఆయన పరిశీలించారు. పంచాయతీరాజ్ డీఈ పీఎస్ రాజ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ఆనందరావు, బొంతు బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



లంకలగన్నవరంలో భారీ వర్షానికి జలమయమైన కొబ్బరి తోటలు



అయినవిల్లి : వర్షం నీటితో తొత్తరమూడి రహదారి

పి.గన్నవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా సరైన వర్షాలు లేకపోవడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం భారీ వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. అలాగే వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేకుండా ఐదు గంటలు భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కొబ్బరి తోటలు, వరి చేలు, పలు కాలనీలు జలమయమయ్యాయి. దీంతో పలు ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. దీంతో వారు వర్షం నీటిని బయటకు తోడుకున్నారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థ లేని కాలనీల్లో వర్షం నీటితో ఆప్రాంతాలు, రహదారులు చెరువులను తలపించాయి. ఉదయం కురిసిన భారీ వర్షానికి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడగా జనజీవనం స్తంభించింది.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పంటచేలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కె.జగన్నాథపురం-తొత్తరమూడి ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో గుంతల్లో వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండలంలోని పలు గ్రామాల్లో వర్షం దంచి కొట్టింది. ఇటీవల ఇంతటి వర్షం ఎప్పుడూ కురవలేదు. భారీగా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

వైద్య శిబిరం

అంతర్వేది, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వీవీమెరకలో టీబీ ముక్త్‌భారత్ అభియాన్ వైద్య శిబిరాన్ని మోరి పీహెచ్‌సీ, 104 భవ్య హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి సీహెచ్ఎస్ ప్రణయ్, డాక్టర్ పూర్ణచంద్రకుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ భారతదేశాన్ని క్షయవ్యాధి (టీబీ) రహిత దేశంగా మార్చాలనే సంకల్పంతో ఈకార్యక్రమం తలపెట్టారన్నారు.అనుమానిత వారి నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించామన్నారు. సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, 104భవ్య హెల్త్ సర్వీస్ సిబ్బంది, డీఈవో రుద్రప్రసాద్, పైలెట్ దుర్గాప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఉత్సవాలపై సమీక్ష

యానాం,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): యానాం శ్రీభూమేత శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలపై అధికారులతో, ఉత్సవదారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల24నుంచి పది రోజులు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. మంగళవారం యానాం వెంకన్న ఆలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణం, ఉత్సవాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, ఉత్సవాదారులు పాల్గొన్నారు. గోపాల్‌నగర్ శివారు పవర్‌గ్రిడ్ ఎదుట ఉన్న నూతన కాలనీలో ప్రజాపనులశాఖ ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను మల్లాడి కృష్ణారావు పరిశీలించారు.

రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

అంతర్వేది, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చేపట్టిన రణభేరి గోడపత్రికలను టేకిశెట్టిపాలెం జడ్పీ హైస్కూలులో మంగళవారం యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలపై పోరాడుతున్న యూటీఎఫ్‌కు మద్దతివ్వాలని అధ్యక్షుడు గొల్లమందల రాజబాబు, సభ్యుడు సీహెచ్ నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి

మామిడికుదురు,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తోందని మండలశాఖ అధ్యక్షుడు యాళ్ల పల్లంరాజు, ప్రధాన కార్యదర్శి చింతా రమేష్ తెలిపారు. పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గోగన్నమఠం, కరవాక, లూటుకుర్రు, ఆదుర్రు ఉన్నత పాఠశాలల్లో, గోగన్నమఠం, నగరం,కరవాక ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. సమస్యలపై పీఆర్టీయూ నాయకత్వం స్పందిస్తున్న తీరును జిల్లా ప్రధాన కార్యదర్శి దీపాటి సురేష్‌బాబు ఉపాధ్యాయులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పెచ్చెట్టి నరసింహమూర్తి, యాళ్ల శ్రీమన్నారాయణ, వన్నెంరెడ్డి సాయిబాబా, తోట వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, ఎం.దుర్గారావు, యెరుబండి భీష్మశ్రీ, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను రక్షించాలి

రాజోలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొరను రక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యతని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం కళాశాల ప్రాంగణంలో ఓజోన్ డే-2025 సైన్స్ నుంచి గ్లోబల్ యాక్షన్ వరకు థీమ్ మీద సదస్సు మంగళవారం నిర్వహించారు.ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సాయిబాబు మాట్లాడుతూ రసాయనాల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. పద్మనాభం, డాక్టర్ సి.సత్యనారాయణ, డాక్టర్ బోస్, డాక్టర్ దయాసాగర్, ఎన్.రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు కొంకాపల్లి విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అమలాపురంరూరల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన స్కూలు గేమ్స్‌ఫెడరేషన్ పోటీల్లో సెపక్‌తక్రా క్రీడకు కొంకాపల్లి జవహర్‌లాల్‌నెహ్రూ మున్సిపల్ హైస్కూలు 7వతరగతి విద్యార్థులు పి.రోహిత్, ఎ.యశ్వంత్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నాని ఫిజికల్ డైరెక్టర్ కట్టా సతీష్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు జిల్లా జట్టు తరపున వీరు ప్రాతినిథ్యం వహిస్తారని హెచ్ఎం ఎం.సీతామహలక్ష్మి తెలిపారు. క్రీడాకారులను కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి-ప్రసాద్, విద్యాకమిటీ చైర్మన్ వి.రాంబాబు, కోచ్ కె.సతీష్, ఎంఎస్ఎన్ ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు సాయిదుర్గ



సాయిదుర్గకు సర్టిఫికెట్ అందజేస్తున్న సుబ్బరాజు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే తైక్వాండో పోటీలకు అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల ఇంటర్ విద్యార్థిని కేదారి సాయిదుర్గ ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ వి.సుబ్బారావు తెలిపారు. స్కూలుగేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన తైక్వాండో సాయిదుర్గ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సాయిదుర్గను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, కార్యదర్శి టి.అవధాని, పరిపాలనాధికారి వెంకటపతిరాజు, ఫిజికల్ డైరెక్టర్ సురేష్‌కుమార్ అభినందించారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

అల్లవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తాడికోనకు చెందిన నిమ్మకాయల దొరస్వామినాయుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1,01,250 చెక్కును ఎమ్మెల్యే అయితాబత్తుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

చెట్టు మధ్య నుంచి అరటిగెల



అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామంలో రైతు వాసంశెట్టి సత్యనారాయణ పొలంలో అరటి చెట్టుకు మధ్య నుంచి గెల వచ్చింది.
(అంబాజీపేట, ఆంధ్రజ్యోతి)

ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం

ముమ్మిడివరం, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):ముమ్మిడివరం ప్రభుత్వడిగ్రీ కళాశాలలో మంగళవారం ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్ అధ్యక్షతవహించి మాట్లాడారు. భూమిని సూర్యుని నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి రక్షించే ఓజోన్ పొరను, దాని ప్రాముఖ్యతను వివరించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.తులసీలక్ష్మి మాట్లాడుతూ అడవులను, చెట్లను నరికివేతను పూర్తిగా నిలిపివేసి మొక్కలు పెంచాలన్నారు. కెమిస్ట్రీ అధ్యాపకుడు డి.పల్లంరాజు మాట్లాడుతూ క్లోరోఫ్లోరో కార్బన్‌లు, రిఫ్రిజిరేటర్లు, ఎయిర్‌కండిషనర్లలో వాడే రసాయనాలు ఓజోన్ పొరను నష్టపరుస్తాయన్నారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతరసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరికి ఘన స్వాగతం



దెందుకూరిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు

అల్లవరం, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): కెనడాపర్యటనను ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వచ్చిన క్షత్రియకార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజుకు మంగళవారం ఘనస్వాగతం లభించింది. పూలదండలు, పుష్పగుచ్ఛాలతో అభిమానులు ఆయన్ను సత్కరించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల కార్యదర్శి పచ్చిమాల ఏడుకొండలు, తెలుగుయువత మండల అధ్యక్షుడు ముత్యాల బాబి, గుంటూరి వెంకట్రాజు(బాల), మంతెన సురేష్‌రాజు,బొక్కా నాగశివప్రసాద్, తోట నరసింహారావు, వేగిరాజు సుబ్బరాజు, కాండ్రేగుల సత్యనారాయణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ, జనసేన, కూటమి నాయకులు తదితరులు దెందుకూరిని సత్కరించి స్వాగతం పలికారు.

బొజ్జా తారకం వర్ధంతి

ముమ్మిడివరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలమ్మచెరువుగట్టు బుద్ధ పార్కు ఆవరణలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయవాది, రిపబ్లికన్ పార్టీ నాయకుడు బొజ్జా తారకం వర్ధంతిని నిర్వహించారు. బి.శరత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బొజ్జా తారకం విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆర్పీఐ నాయకుడు పెనుమాల సుధీర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం ఆఖరి శ్వాస వరకు పోరాడిన పోరాట యోధుడు బొజ్జా తారకమన్నారు. కార్యక్రమంలో వజ్రపు శరత్, తాటిపాక దుర్గబాబు, జనిపల్లి సత్యనారాయణ, యడ్ల చిట్టిబాబు, కాశి లాజర్, చుక్కా మనోజ్, కాలా మహర్, నందిక ప్రసాద్, బూసి రాంబాబు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్ సూచించారు. అంబాజీపేట పీహెచ్‌సీ పరిధిలో బుధవారం నుంచి అక్టోబరు 2వరకు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈశిబిరాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

అమలాపురం రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన రాజ్‌కమల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యర్రమిల్లి జయరామ్ ఆధ్వర్యంలో ఏటా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేస్తున్నట్టు సంస్థ సలహాదారు, గణితావధాని డాక్టర్ పీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ కంమెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు హాజరయ్యే 8వ తరగతి విద్యార్థులకు రాజ్‌కమల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.70లక్షల విలువైన స్టడీ మెటీరియల్‌ను జిల్లాలోని 35పాఠశాలల విద్యార్థులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, హెచ్ఎం కాశి ఘనసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పెరిగిన రైతుల ఆత్మహత్యలు'

అల్లవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు నష్టాల పాలైనందున ఆత్మహత్యలు పెరిగాయని వైసీపీ రైతువిభాగం రాష్ట్ర అధ్యక్షుడు జిన్నూరి రామారావు ఆరోపించారు. డి.రావులపాలెంలో ఆయన స్వగృహం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బత్తాయి, అరటి, పొగాకు తదితర వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేదని ఆరోపించారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, కాండ్రేగుల జవహర్, తిక్కా వెంకటప్రసాద్, శీలం సూరిబాబు, మామిడిశెట్టి సతీష్, బళ్ల శివ, యాళ్ల చిన్నా పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ

ముమ్మిడివరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ డి.జ్వాలాసాగర్ పేర్కొన్నారు. అనాతవరం పీఎంశ్రీ స్కూలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కె.రాధ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఎస్ఐ మాట్లాడారు. మాదక ద్రవ్యాలు మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె.రాధ, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, ఎ.అర్జునరావు, కె.తాతాజీ, ఎన్.తులసీభవానీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ మండల నూతన కార్యవర్గం

కాట్రేనికోన, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి):కాట్రేనికోనలో మంగళవారం విప్పర్తి మోహనరావు అధ్యక్షతన సీఐటీయూ సమావేశం జరిగింది. అన్ని వర్గాల కార్మికుల సమస్యలపై చర్చించారు.మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా విత్తనాల రాంబాబు, కోకన్వీనర్‌గా విప్పర్తి మోహనరావు, సభ్యులుగా సాపే దుర్గామహేశ్వరి, బొంతు పార్వతి, వజ్రపు మల్లేశ్వరి, గంజా సత్తిబాబు, అడబాల చంద్రశేఖర్, అయితాబత్తుల శ్రీనివాసరావు, కొడమంచిలి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్మికుల సమస్యలపై సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ మాట్లాడారు.

కుల ధ్రువీకరణ పత్రాల్లో శెట్టిబలిజ చేర్చడంపై హర్షం

మామిడికుదురు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గౌడకు బదులుగా శెట్టిబలిజ కులం పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరుకు జీవో విడుదల చేయడం అభినందనీయమని శెట్టిబలిజ సంఘ మండల అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్ అన్నారు. మామిడికుదురు బీసీ సామాజిక భవనంలో శెట్టిబలిజ నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కులధ్రువీకరణ పత్రాల్లో గౌడ రావడంపై తీవ్ర అభ్యంతరాలు రావడంతో ముఖ్యమంత్రి దృష్టికి మంత్రి వాసంశెట్టి సుభాష్ తీసుకువెళ్లారన్నారు. నయినాల సత్యనారాయణమూర్తి, బొక్కా వీరవెంకటేశ్వరరావు, పెచ్చెట్టి సత్యచంద్ర, కడలి నూకరాజు, భైరిశెట్టి రామకృష్ణ, మట్టపర్తి శివ, కంచి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



నదురుబాద రోడ్డుకు భూమిపూజ సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం వెదురుపాక-నదురుబాద రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామచంద్రపురం బైపాస్ నుంచి నదురుబాద మీదుగా వెదురుపాక వెళ్లే రోడ్డుకు నాబార్డు నిధుల నుంచి డిప్యూటీ సీఎం పవన్ నిధులు మంజూరు చేశారన్నారు. మండపేట నియోజకవర్గంలో పంచాయతీరాజ్ నిధుల నుంచి మొదటిసారిగా నదురుబాద-వెదురుపాక రోడ్డు మంజూరు చేశారన్నారు. నదురుబాద గ్రామానికి చెందిన వైసీపీనేత అనేక పదవులు చేసినా డ్రైన్లు, రోడ్లు నిర్మించకపోగా తమపై పలు విమర్శలు చేశారని ఎమ్మెల్యే అన్నారు. ప్రధాని మోదీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేష్ రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ ఉండవిల్లి సుబ్బారాయుడు, వద్దాది చిన్నకృష్ణంరాజు, కొవ్వూరి చంటిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, డీపీఆర్‌ఈఈ పి.రామకృష్ణారెడ్డి, డీఈఈ ఎ.రాంబాబు, ఏఈ పి.సత్యనారాయణ, కొండలరావు, ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన, పోతుల గంగాధరప్రసాద్, ఉండవిల్లి రాంబాబు, బండారు జోగారావు, మాజీ సర్పంచ్ జుత్తుగ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ రాజు తదితరులు

ఓజోన్‌పొర సంరక్షణ అందరి బాధ్యత

కొత్తపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఓజోన్‌పొర సంరక్షణ అందరి బాధ్యత అని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొర చేసే చర్యలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసులు, పి.సాయికృష్ణ, టీసీహెచ్ పాపారావు, కె.అంకంరావు, సీహెచ్ నాగారాణి, సత్యనారాయణ, నాగదీపిక, విద్యార్థులు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): ఓజోన్‌పొర పరిరక్షణ అందరి బాధ్యత అని వక్తలన్నారు. మంగళవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఓజోన్ పరిరక్షణపై పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, రసాయశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి.శారా, ఫిజిక్స్ అధ్యాపకులు కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో...

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షించుకుంటేనే మానవ మనుగడ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.రజని, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు.రమేష్‌బాబు, ఎస్.అరుణకుమార్, వరప్రసాద్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జొన్నాడ పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతి

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి వరద

ఆలమూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహంతో గోదావరి ఉధృతి స్వల్పంగా పెరుగుతోంది. జొన్నాడ పుష్కరఘాట్ వద్ద వరద ప్రవాహం పెరిగింది. వారం రోజులుగా నిలకడగా కొనసాగిన వరద ప్రవాహం సోమ, మంగళవారాల్లో స్వల్పంగా పెరుగుదల కన్పించింది. దీంతో పుష్కరఘాట్‌లోకి వరదనీరు చేరింది. జొన్నాడ రెండు బ్రిడ్జిల మధ్య వరద ప్రవాహం ఉధృతంగా పారుతోంది. వారం రోజుల క్రితం లంక గ్రామాల్లో కొన్ని లోతట్టు ప్రాంతాలకు చేరిన వరద తగ్గి ప్రస్తుతం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వరద పెరిగినట్టు అధికారులంటున్నారు.

పాలక మండళ్లు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

కొత్తపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాలక మండళ్లు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సత్యానందరావు తనయుడు యువ నాయకుడు సంజీవ్ పేర్కొన్నారు. మంగళవారం వానపల్లి పళ్లాలమ్మ దేవస్థానం ఆవరణలో ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సంజీవ్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం ఈవో బి.వెంకటరమణమూర్తి చైర్మన్‌గా మద్దింశెట్టి ఆదినారాయణ, సభ్యులుగా సబ్బితి పల్లంరాజు, గంగుమళ్ల సుజాత, కంచుస్తంబం నరసింహారావు, దాసరి సూర్యకుమారి, వానపల్లి సాయిబాబు, దూనబోయిన అర్జునరావు, రవణం కనకమహాలక్ష్మి, వనుము కనకత్రివేణితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి భీమారావు, కూటమి నాయకులు ఎం.బాబ్జి, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మురమళ్ళ వీరేశ్వరస్వామికి మంగళవారం రుద్రహోమం నిర్వహించారు. అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, రుద్ర హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలను ఘనంగా జరిపారు.





ప్రమాదంగా మారిన వెదురుమూడి వంతెన. పక్క చిత్రంలో వంతెన అడుగుభాగంలో శిథిలావస్థకు చేరుకున్న దృశ్యం

శిథిలావస్థలో వెదురుమూడి వంతెన

• బెంబేలెత్తుతున్న వాహనదారులు • చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ హయాంలో వెదురుమూడి ఆర్‌అండ్‌బీ రహదారిపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. మండలంలోని అంగర, పడమరఖండ్రిక, కపిలేశ్వరపురం, వెదురుమూడి, నల్లూరు, మాచర, టేకి, పరిసర గ్రామాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ వంతెన మీద నుంచే వెళ్లాలి. ప్రతి రోజూ లారీలు, ట్రాక్టర్లు, బస్సులు వాహనాలతో పాటు ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వందలాదిగా ఈ మార్గంగుండా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వంతెన దాటే వరకు ప్రాణాలు అరచేత పట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇటీవల వంతెనకు సపోర్టుగా నిర్మించిన సిమ్మెంట్ దిమ్మకూలి డ్రైన్‌లో పడిపోయిందని స్థానికులంటున్నారు. వంతెనకు ఇరువైపులా రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఐరన్ మెస్ కొంతమేర లేకుండా పోయిందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో వాహనాలు అదుపుతప్పి తరచూ ప్రమాదాల బారినపడిన ఘటనలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా ఈ వంతెన దుస్థితి మారడం లేదని పలువురు ధ్వజమెత్తుతున్నారు. నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ప్రయాణికులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

కె.గంగవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బైక్ చోరీపై కేసు నమోదు చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..సామర్లకోటకు చెందిన మేడిశెట్టి రవికుమార్ గతనెల 14న కోటిపల్లి ఛాయాసోమేశ్వరస్వామి ఆలయానికి వచ్చారు. స్వామి దర్శనం చేసుకుని వచ్చేలోగా గుర్తు తెలియని వ్యక్తులు అతని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను దొంగలించుకుని పోయారు. దీనిపై రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

స్వచ్ఛత ఉత్సవాలను జయప్రదం చేయండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 2 గాంధీ జయంతిని స్వచ్ఛాంధ్ర దినోత్సవంగా పరిగణిస్తూ నేటి నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. మంగళవారం హెల్త్ సెక్రటరీ, అంగన్‌వాడీ సిబ్బంది, శానిటరీ సెక్రటరీలకు సమావేశం జరిపారు. సమావేశంలో కమిషనర్ రాజు మాట్లాడుతూ పట్టణ శుభ్రత ప్రజల బాధ్యత అన్నారు. ఈనెల 25న ఉదయం 10 గంటల నుంచి 11 వరకు ప్రజలంతా తమ నివాస పరిసర ప్రాంతాలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు వద్ద శ్రమదానం చేయాలన్నారు. ఆయా రోడ్డు మార్జిన్లలో మొక్కలు నాటాలన్నారు.





సమావేశంలో రెవెన్యూ విభాగం అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల. చిత్రంలో చైర్‌పర్సన్ నూకదుర్గారాణి

అవినీతిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తా..

వాడివేడిగా మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ విభాగంలో రెవెన్యూ శాఖ అవినీతిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మున్సిపల్ సమావేశం మంగళవారం వాడివేడిగా జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎక్స్ అఫీ షియో సభ్యుడిగా హాజరైన ఎమ్మెల్యే మున్సిపల్ ఉద్యోగుల తీరుపై ధ్వజమెత్తారు. మున్సిపల్ దుకాణాల అద్దె బకాయిల వ్యవహారంపై ఇప్పటి వరకు ఏం చర్యలు తీసుకున్నారంటూ ఎమ్మెల్యే అధికారులను నిలదీయడంతో ఆర్డీకి రిపోర్టు పంపుతామని కమిషనర్ రంగారావు చెప్పిన సమాధానానికి ఆయన శాంతించలేదు. మున్సిపల్ అధికారుల తీరు బాగాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ ఆర్ఐ, ఆర్వోల వ్యవహారశైలిపై ఫిర్యాదులు ఉన్నాయన్నారు. కంపోస్టుయార్డులో చెత్త తరలింపు తొలగింపు కోసం లక్షలాది నిధులు జేసీబీలు, ట్రాక్టర్ల కోసం వెచ్చించటం ఏమిటని చైర్‌పర్సన్ రాణి అధికారులను ప్రశ్నించారు. కమిషనర్ రంగారావు సమాధానం ఇస్తూ గత ప్రభుత్వం ఆటోలను ఇచ్చిందని వాటిని ఎక్కడా వినియోగించలేదన్నారు. తక్షణమే తిరిగి పంపించేయాలని సభ్యులు కోరగా వైసీపీ కౌన్సిలర్ మందపల్లి రవి కలుగచేసుకుని గత ప్రభుత్వంలో ఆటోలు ఇచ్చారని వార్డుల్లో చెత్త సేకరణ కోసం వాటిని వాడాల్సి ఉండగా వాడలేదన్నారు. వర్షాల కారణంగా చెత్త తరలింపునకు ఇబ్బంది కలుగుతుందని డీఈఈ శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలో విద్యుత్ వైర్లకు వున్న కేబుల్ వైర్లను తొలగించాలని కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ కోరారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వాటి నిర్మూలకు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. మండపేట కమ్మ సంఘం వద్ద మహిళా ప్రయాణికులు బస్సులు ఎక్కుతున్నారని వారికి టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఏడిద రోడ్డులో వున్న బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని చైర్‌పర్సన్ రాణి కోరగా వైసీపీ పాలనలో బస్టాండ్‌ను ఎందుకు వాడలేదని వేగుళ్ల ప్రశ్నించారు. అనంతరం అజెండాలోని అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్‌తోపాటు వైస్ చైర్మన్‌లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్యబాబు, కౌన్సిలర్‌లు కాళ్లకూరి స్వరాజ్య భవాని, చిట్టూరి సతీష్, కొవ్వాడ బేబి, చుండ్రు చినసుబ్బారావు చౌదరి, పోతంశెట్టి ప్రసాద్, యారమాటి గంగరాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.





కపిలేశ్వరపురం మండలం అంగరలో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీహెచ్‌ఈవో మల్లికార్జునుడు. పక్క చిత్రంలో కె.గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న డిప్యూటీ పారా మెడికల్ అధికారి వెంకటేశ్వర్లు

స్వస్థ నారీ..సశక్త్ పరివార్ అభియాన్‌పై అవగాహన

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర పీహెచ్‌సీ, పంచాయతీ కార్యాలయం వద్ద వైద్యాధికారిణి రత్నకుమారి ఆధ్వర్యంలో మంగళవారం స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ అంగర ఎంపీహెచ్‌ఈవో జె.మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన మహిళలు-బలమైన కుటుంబాలు కార్యక్రమం బుధవారం నుంచి అక్టోబరు 2 వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆర్.మోహన్, ఎంపీహెచ్ఎస్ ఎం.నానిబాబు, హెచ్‌వీ టి.మేరీమణి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి ఎం.వెంకటేశ్వరులు, డీఎల్‌టీవో డాక్టర్ రామానుజం అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆరు పీహెచ్‌సీల వైద్య సిబ్బందికి ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు గుడాల శ్రీమన్నారాయణ, కమల శేష, పామర్రు, దంగేరు, కుందూరు, పేకేరు, వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకం ద్వారా ఆడబిడ్డల సంపూర్ణ ఆరోగ్యం ప్రచారంలో భాగంగా మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బంది అధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజు అధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయికిషోర్, భాగ్యశ్రీ, డీహెచ్‌ఈవో రాజా అక్కల, మండల విద్యాశాఖాధికారులు బి.అప్పాజీ, ఎన్.రాజు పలువురు అధికారులు పాల్గొన్నారు.



విరాళం ఇచ్చిన దాతలకు స్వామివారి చిత్రపటం అందజేసిన దృశ్యం

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి గోపాలపురం మండలం చిట్యాలకు చెందిన నందిని సతీష్ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళం ఇచ్చారు. రావులపాలానికి చెందిన పులవర్తి దుర్గా అనూష కుటుంబ సభ్యులు రూ.31,485 విరాళం అందజేశారు. దాతలకు ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు. ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

ద్రాక్షారామ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నేడు జరగనున్న ప్రధానిమోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం ద్రాక్షారామ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించనున్న సేవా పక్షడ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, కో కన్వీనర్ ఇంధన సత్యనారాయణ, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వాడ్రేవు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలి

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువుల పట్ల పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అనిత అన్నారు. మండలంలోని వల్లూరు, కోరుమిల్లి గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వల్లూరు గ్రామంలో 281, కోరుమిల్లి గ్రామంలో 400 పశువులకు టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమాల్లో పశువైద్యాధికారులు డాక్టర్ వీవీ రమణమూర్తి, డాక్టర్ లక్ష్మీకుమారి, సర్పంచ్ దాసి మీనాకుమారి, ఈశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ గుత్తుల శ్రీనివాస్, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి స్థలం పరిశీలన

ఆలమూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలమూరులో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి మంగళవారం ఎంపీడీవో ఎ.రాజు అధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అనువుగా ఉన్న పలు స్థలాలను ఎంపీడీవో రాజుతోపాటు పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిషోర్, డిప్యూటీ హెచ్‌ఈవో రాజా, పంచాయతీ కార్యదర్శి మోక్షాంజలి, టీడీపీ నాయకులు సాలి సత్యనారాయణ, మానేపల్లి శ్రీనివాస్ స్థలం పరిశీలనలో పాల్గొన్నారు. వైద్య సిబ్బందికి, ప్రజలకు అందుబాటులో ఉండేలా అనువైన స్థలాన్ని కేటాయింపు చేస్తామని ఎంపీడీవో తెలిపారు.



వెల్‌నెస్ సెంటర్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాఠశాల విద్యార్థులకు గొడుగులు బహూకరణ

కె.గంగవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గొడుగులను బహూకరించారు. పాణింగపల్లి, తామరపల్లి, నీలగిరిపేట తదితర గ్రామాల నుంచి పాఠశాలకు వస్తున్న 48 మంది విద్యార్థులకు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు చెల్లుబోయిన శ్రీనివాసు వాటిని బహూకరించారు. పాఠశాలకు వచ్చే సమయంలో వర్షం వస్తే వారికి ఈ గొడుగులు ఎంతో ఉపయోగపడతాయన్నారు.



విద్యార్థులకు గొడుగులు అందజేసిన దృశ్యం

ఆర్డీవోను కలిసిన మోనటరింగ్ కమిటీ సభ్యుడు

ఆత్రేయపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడిగా ర్యాలి గ్రామానికి చెందిన పాలంగి రవిచంద్రను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్డీవో చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, డీఎస్పీ, ఎంపీడీవో, తహసీల్దార్లు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. సభ్యుడిగా ఎంపికైన ఆయన మంగళవారం ఆర్డీవో శ్రీకర్‌ను కలిసి సత్కరించారు.



కొత్తపేట ఆర్డీవో శ్రీకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం



పాఠశాలలో పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో స్వచ్ఛత శపథ్ దినోత్సవం

కె.గంగవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత శపథ్ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణలోని చెత్తా చెదారాన్ని తొలగించారు. మండలంలోని పలు పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రం చేసి స్వచ్ఛత శపథ్ దినోత్సవాన్ని నిర్వహించారు.

ఎంఈవో-2 బాధ్యతలు స్వీకరణ

ఆలమూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి-2గా నర్సిపూడి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నేదునూరి రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈవో-2గా పనిచేసిన సుబ్బరాజు ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో ఆలమూరు ఎంఈవో-2గా రాజును నియమిస్తూ కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను పలువురు అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

విద్యార్థి విభాగ ఉపాధ్యక్షుడిగా జయరాం నియామకం

రావులపాలెం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్తపేట నియోజకవర్గ విద్యార్థి విభాగ ఉపాధ్యక్షుడిగా రావులపాలెం కొత్తకాలనీకి చెందిన డి.జయరాం నియమితులయ్యారు. నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే సత్యానందరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



క్రీడా పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

రాయవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి అన్నారు. మంగళవారం రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో పాల్గొనాలన్నారు. అనంతరం ఆయన క్రీడా పోటీలను ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కన్వీనర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్ తదితర పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, హెచ్‌ఎం వి.శాంతి సునీత, వివిధ పాఠశాల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.





వాడపల్లి వెంకన్న ఆలయంలో ఉట్టి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ఉట్టి మహోత్సవం

ఆత్రేయపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ క్షేత్రపాలకుడు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వైష్ణవ సంప్రదాయం ప్రకారం కృష్ణాష్టమి వేడుకలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ తూర్పువైపున ఫలపుష్పాలతో అలకరించి ఉట్టి మహోత్సవాన్ని వైభవంగా అలంకరించారు. అశేష భక్తజనం మధ్య ఉట్ల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అశేష భక్తజనం స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు వీటి ఏర్పాట్లు నిర్వహించారు. ఉట్టి మహోత్సవానికి వచ్చిన భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

అన్న సమారాధన

ఆత్రేయపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం గణపతి నవరాత్రి ముగింపు వేడుకల్లో భాగంగా అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి అన్న ప్రసాదంలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్యాస్ ఏజెన్సీ మూతపడటంతో వినియోగదారుల అవస్థలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): భారత్ గ్యాస్ ఏజెన్సీ మూతపడటంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆత్రేయపురం లొల్లలాకుల వద్ద భారత్ గ్యాస్ ఏజెన్సీ కొన్ని కారణలతో మూతపడటంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ ఏజెన్సీ ఉన్నప్పుడు బుక్ చేసిన 24 గంటల్లోపు ప్రజలకు గ్యాస్ సిలెండర్లు అందించేవారు. కొంత కాలం నుంచి మూత పడటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏజెన్సీ అదనపు బాధ్యతలను రాజమహేంద్రవరం భారత్ ఏజెన్సీకి అప్పగించారు. ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాలతో పాటు రావులపాలెం మండలంలోని పలు గ్రామాలకు వేల సంఖ్యలో గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ఆన్‌లైన్‌లో గ్యాస్ బుక్ చేసిన వారికి రాజమహేంద్రవరం ఏజెన్సీ నుంచి వాహనం ద్వారా గ్యాస్ సిలెండర్లు సరఫరా అందించాల్సి ఉంది. ఇటీవల పలువురు వినియోగదారులు గ్యాస్ బుక్ చేసి 10 రోజులు కావస్తున్నా ఇప్పటికీ రాలేదని వాపోయారు. గ్యాస్ సిలెండర్ ఎప్పుడు వస్తుందా అని వారు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా సకాలంలో భారత్ గ్యాస్ వినియోగదారులకు సిలెండర్లను సరఫరా చేయాలని మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.